ఆగమాగం అవ్వొద్దు

- అభివృద్ధి, సంక్షేమాన్ని చూడండి
- ఆలోచించి ఓటు వేయండి
- బీఆర్‌ఎస్‌ను మరోసారి గెలిపించండి
- నియోజకవర్గం ప్రచారంలో మల్లారెడ్డి


ప్రచారంలో మంత్రి మల్లారెడ్డి



మేడ్చల్ జోన్ బృందం: తెలంగాణ రాష్ట్రంలో అన్నివర్గాల అభ్యున్నతికి పాటుపడిన బీఆర్‌ఎస్‌ను మరోసారి గెలిపించాలని మంత్రి మల్లారెడ్డి అన్నారు. శనివారం నాగారం మున్సిపాలిటీ రాంపల్లిలో నిర్వహించిన బీఆర్‌ఎస్ గౌడ కులస్తుల ఆత్మీయ సభలో, ఘట్‌కేసర్ మండలం అవుషాపూర్, అంకుషాపూర్ గ్రామాల్లో నిర్వహించిన రోడ్ షోలలో, పోచారం మున్సిపాలిటీ పరిధిలోని యంనంపేట్, ఇస్మాయిల్‌ఖాన్‌గూడ, లక్ష్మీనర్సింహస్వామి కాలనీ, పోచారంలో నిర్వహించిన కార్నర్ మీటింగ్‌లలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి మల్లారెడ్డి మాట్లాడుతూ ఎన్నికల్లో తనను మరోసారి గెలిపిస్తే అభివృద్ధి చేస్తానని హామీ ఇచ్చారు. ఎంతోమంది ఎన్నో మాటలు చెబుతారని, వారి మాటలు విని ఆగమాగం కావొద్దని ఆలోచించి అభివృద్ధి, సంక్షేమానికి ఓటు వేయాలని కోరారు. మేడ్చల్ నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేశామని మరోసారి అవకాశమిస్తే మరింత అభివృద్ధి చేస్తానని అన్నారు. ప్రజలకు కావాల్సి పనులన్నీ పూర్తి చేశామని, నియోజకవర్గాన్ని ఆదర్శంగా మార్చడానికి మరిన్ని అభివృద్ధి పనులు చేపడతామన్నారు.

కీసరలో..

రాంపల్లిని దత్తత తీసుకుని అభివృద్ధి చేస్తామని, రాంపల్లిలో గౌడ కులస్తులకు కేటాయించిన స్థలానికి పట్టా పాసుపుస్తకాలతో పాటు ధరణిలో పేరు నమోదు చేయిస్తామన్నారు.

ఘట్‌కేసర్‌లో..

ప్యాకేజీలు తీసుకున్నవారు ఓడిస్తామని ప్రచారం చేస్తున్నారు. నియోజకవర్గంలోని 61 పంచాయతీల్లో కోట్లాది రూపాయలు వచ్చింది పనులు చేయించానని, గ్రామీణ మహిళల స్వయం ఉపాధికి కుట్టు మిషన్లు అందజేశామన్నారు. మాజీ ఎమ్మెల్యే నియోజకవర్గాన్ని అభివృద్ధి చేయలేదని, ప్యాకేజీ తీసుకొని ఓడిస్తాని ప్రచారం చేస్తున్నాడని విమర్శించారు. కారు గుర్తుకు ఓటేసి ముచ్చటగా మూడోసారి బీఆర్‌ఎస్ ప్రభుత్వం తేవాలని పిలుపునిచ్చారు.

పోచారంలో..

మున్సిపాలిటీ పరిధిలోని యంనంపేట్, ఇస్మాయిల్‌ఖాన్‌గూడ, లక్ష్మీనర్సింహస్వామి కాలనీ, పోచారంలలో నిర్వహించిన కార్నర్ మీటింగ్‌లలో ఆయన పాల్గొని కారు గుర్తుకు ఓటేసి తనను గెలిపించాలని కోరారు.

వివిధ ప్రాంతాల్లో..

నియోజకవర్గ పరిధిలోని మేడ్చల్, తూంకుంట, జవహర్‌నగర్, శామీర్‌పేట్, మూడు చింతలపల్లిలో బీఆర్‌ఎస్ నాయకులు ఇంటింటి ప్రచారం చేశారు. కరపత్రాలను పంచుతూ నమూనా ఈవీఎంను వెంటబెట్టుకుని ఓటు ఎలా వేయాలో అవగాహన కల్పించారు.


రాంపల్లిలో నిర్వహించిన గౌడ కులస్తుల ఆత్మీయ సభలో మంత్రి మల్లారెడ్డి


ప్రచారంలో జనం

తనిఖీల్లో రూ.58.48 కోట్లు స్వాధీనం

- గ్రీవెన్స్ కమిటీ ద్వారా రూ.43 కోట్లు తిరిగి అప్పగింత
- జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ గౌతమ్



సాక్షి, మేడ్చల్ జిల్లా: ఎన్నికల నేపథ్యంలో జిల్లావ్యాప్తంగా అనేక చోట్ల ప్రత్యేక నిఘా ఏర్పాటు చేసి విస్తృతంగా తనిఖీలు నిర్వహిస్తున్నట్లు జిల్లా ఎన్నికల అధికారి గౌతమ్ తెలిపారు. చెక్ పోస్టుల తనిఖీల్లో పోలీసులు రూ.58,48,62,662 స్వాధీనం చేసుకున్నారన్నారు. జిల్లా గ్రీవెన్స్ కమిటీ ధ్రువ పత్రాలను పరిశీలించిన మీదట అన్నీ సక్రమంగా ఉన్న రూ.43 కోట్లు తిరిగి అప్పగించినట్లు పేర్కొన్నారు. అలాగే ఆబ్కారీ (ఎక్సైజ్) శాఖ ఆధ్వర్యంలో 2,17,073 లీటర్ల మద్యం స్వాధీనం చేసుకుని 1,114 కేసులు నమోదు చేయడం ద్వారా 487 మందిని అరెస్టు చేసినట్లు తెలిపారు. ఎన్నికల ప్రవర్తనా నియమావళిని అనుసరించి రూ.50 వేలకంటే ఎక్కువ నగదు తీసుకెళ్లరాదని, ఒకవేళ తీసుకెళ్తే అందుకు సరైన ధ్రువపత్రాలు కలిగి ఉండాలన్నారు. లేనిపక్షంలో నగదు సీజ్ చేస్తామన్నారు. అనుమతులు లేకుండా నగదు, మద్యం తరలించవద్దన్నారు. అలాగే, పోలీసులు, ఎన్నికల అధికారుల నిఘా ప్రత్యేకంగా కొనసాగుతుందన్నారు. ఎన్నికల కోడ్ అమలుపై పోలీసులు, ఎన్నికల అధికారులు ప్రత్యేక దృష్టి సారించేలా ఆదేశాలు ఇచ్చినట్లు పేర్కొన్నారు.

నేటి ప్రచారాలు

మేడ్చల్: ఎన్నికల ప్రచారంలో భాగంగా ఆదివారం మేడ్చల్ మండలంలో బీఆర్‌ఎస్, కాంగ్రెస్ అభ్యర్థులు ప్రచారం చేయనున్నారు. బీఆర్‌ఎస్ అభ్యర్థి మంత్రి మల్లారెడ్డి గౌడవెల్లి, రాయిలాపూర్, బండమాదారం, నూతన్‌కల్, శ్రీరంగవరం, డబీల్‌పూర్ గ్రామాల్లో ప్రచారం నిర్వహిస్తారని బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు దయానంద్‌యాదవ్ తెలిపారు.

◆ కాంగ్రెస్ తరఫున ఆ పార్టీ స్టార్ క్యాంపెయినర్ తీన్మార్ మల్లన్న మేడ్చల్‌లో ప్రచారం చేస్తారని కాంగ్రెస్ నాయకులు తెలిపారు. వివేకానంద విగ్రహం వద్ద ఏర్పాటు చేసిన కార్నర్ మీటింగ్‌లో ఆయన పాల్గొంటారని తెలిపారు.

బీఆర్‌ఎస్‌లో చేరికలు

మేడ్చల్: మండలంలోని గౌడవెల్లి, శ్రీరంగవరం గ్రామాలకు చెందిన 100మంది యువకులు బీఆర్‌ఎస్‌లో చేరారు. జిల్లా సర్పంచ్‌ల ఫోరం అధ్యక్షుడు విజయానందరెడ్డి సమక్షంలో బీఆర్‌ఎస్‌లో చేరారు. పార్టీలో చేరిన వారికి విజయానందరెడ్డి, బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు దయానంద్‌యాదవ్ కండువాలు కప్పి ఆహ్వానించారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ భాస్కర్‌యాదవ్, పీఏసీఎస్ చైర్మన్ రందీప్‌రెడ్డి, మాజీ సర్పంచ్‌లు జగన్‌రెడ్డి, సురేందర్, ఎంపీటీసీ ప్రకాష్, నాయకులు అప్పల కృష్ణ, జి.శ్రీనివాస్‌రెడ్డి, ప్రకాష్‌రెడ్డి, ఉపసర్పంచ్ నర్సింహ తదితరులు పాల్గొన్నారు.

సబ్బండ వర్గాల అభివృద్ధే కాంగ్రెస్ ధ్యేయం



మేడిపల్లి: సబ్బండ వర్గాల అభివృద్ధే కాంగ్రెస్ ఎజెండా అని మేడ్చల్ కాంగ్రెస్ అభ్యర్థి తోటకూర వజ్రేష్ యాదవ్ అన్నారు. పీర్జాదిగూడ కార్పొరేషన్ నాయీ బ్రాహ్మణుల సంఘం అధ్యక్షుడు మాచర్ల రవి, వారి బృందం పీర్జాదిగూడ నగర కాంగ్రెస్ అధ్యక్షుడు తుంగతుర్తి రవి, శేరి సవితారెడ్డి ఆధ్వర్యంలో శనివారం కాంగ్రెస్‌లో చేరారు. ఈ మేరకు పీర్జాదిగూడ కాంగ్రెస్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో నాయీ బ్రాహ్మణ సంఘం సభ్యులకు మేడ్చల్ కాంగ్రెస్ అభ్యర్థి తోటకూర వజ్రేష్ యాదవ్ కాంగ్రెస్ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. పన్నాల శ్రీనివాస్‌రెడ్డి, వేముల మహేష్‌గౌడ్, మహిళా నాయకురాలు శేరి సవితారెడ్డి, పవన్‌గౌడ్, మోహన్ కుమార్, మణిరాం నాయక్, జంపాల శ్రీనివాస్ నాయీబ్రాహ్మణ సంఘం సభ్యులు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌లో పలువురి చేరిక



బోడుప్పల్: బోడుప్పల్ డ్రైవర్స్, పెయింటర్స్ యూనియన్ సభ్యులు శనివారం సాయంత్రం కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు పోగుల నర్సింహారెడ్డి, మేడ్చల్ నియోజకవర్గ కాంగ్రెస్ అభ్యర్థి తోటకూర వజ్రేష్‌యాదవ్ సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. అలాగే బోడుప్పల్ బీజేపీ ప్రధాన కార్యదర్శి దేవరకొండ వెంకటాచారి, వజ్రేష్‌యాదవ్, కాంగ్రెస్ నాయకులు నక్క ప్రభాకర్‌గౌడ్, రాపోలు రాములు సమక్షంలో కాంగ్రెస్ పార్టీ కండువా కప్పుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మేడ్చల్ నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీ ప్రభంజనం సృష్టిస్తుందన్నారు.

సేజ్ స్కూల్లో ఎక్స్ పో



మేడిపల్లి: పీర్జాదిగూడ మున్సిపల్ కార్పొరేషన్‌లోని సేజ్ స్కూల్లో ఎక్స్‌పోను శనివారం వేడుకగా నిర్వహించారు. అనంతరం విద్యార్థులు తమ స్కిల్స్, నైపుణ్యం, సృజనాత్మకతతో రూపొందించిన వివిధ నమూనాల వివరాలను ఎక్స్‌పోకు వచ్చిన తల్లిదండ్రులకు అర్థమయ్యే రీతిలో వివరించారు. అనంతరం కరస్పాండెట్ రోహిత్‌రెడ్డి, ప్రిన్సిపాల్ సీతామహాలక్ష్మి ఎక్స్‌పోలో ప్రతిభ కనబర్చిన విద్యార్థులను అభినందించారు. కార్యక్రమంలో విద్యార్థులు, అధ్యాపకుల తల్లిదండ్రులు, స్కూల్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

బ్యాడ్మింటన్‌లో రాజ్‌కుమార్ ప్రతిభ

మూసాపేట: ఉస్మానియా విద్యాలయం వారు స్పోర్ట్స్ డే ఇంటర్ కాంపిటీషన్స్ నిర్వహించారు. బ్యాడ్మింటన్ సింగిల్‌లో కూకట్‌పల్లి ప్రభుత్వ డిగ్రీ కళాశాల బీబీఏ మొదటి సంవత్సరం చదువుతున్న పి.రాజ్‌కుమార్‌కు మొదటి బహుమతి దక్కించున్నాడు.ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ డా. ఎన్. అలివేలు మంగమ్మ విద్యార్థినిని అభినందించారు. ఈ విద్యార్థినిని స్ఫూర్తిగా తీసుకొని మిగిలిన విద్యార్థులు కూడా వివిధ పోటీల్లో పాల్గొనాలని సూచించారు. కళాశాల వైస్ ప్రిన్సిపాల్ డా.బి.భవాని, అధ్యపకులు డా.సాలయ్య, డా.శ్రీనివాస్, డా.శారద, రజిత, ఖాదిరున్నీసాలు విద్యార్థికి అభినందనలు తెలిపారు.

కురుమ సంఘం సమ్మేళనంలో రసాభాస


రసాబాసగా కురుమ సంఘం ఆత్మీయ సమ్మేళనం

శామీర్‌పేట్: శామీర్‌పేట మండంలోని సెలబ్రిటీ రిసార్ట్స్‌లో మేడ్చల్ జిల్లా కురుమ సంఘం ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. కార్యక్రమానికి జిల్లాలోని కురుమ సంఘం సభ్యులు పాల్గొన్నారు. కాగా సమావేశంలో పాల్గొన్న కొందరు మంత్రి మల్లారెడ్డికి అనుకూలంగా మాట్లాడటంతో మరికొందరు అభ్యంతరం వ్యక్తం చేశారు. ఇది రాజకీయ సమావేశం కాదని, కురుమ సంఘం అభివృద్ధి కోసం మాత్రమే చర్చించాలని డిమాండ్ చేశారు. దీంతో సమావేశంలో తీవ్ర వాగ్వాదం జరిగింది. చాలాసేపు ఉద్రిక్తత వాతావరణం కొనసాగడంతో పోలీసులు రంగప్రవేశం శాంతింపజేశారు.

అంకుషాపూర్‌లో దళితుల నిరసన


అంకుషాపూర్‌లో నిరసన తెలుపుతున్న దళితులు

ఘట్‌కేసర్: అంకుషాపూర్‌లో శనివారం నిర్వహించిన కార్నర్ మీటింగ్‌కు నిరసన సెగ తగిలింది. సమావేశంలో మంత్రి మల్లారెడ్డి సంక్షేమ పథకాలు ప్రస్తావిస్తుండగా గ్రామంలో దళిత బంధు ఎంత మందికి ఇచ్చారో తెలపాలని కొందరు దళితులు నిరసన చేపట్టారు. నియోజకవర్గంలో 120 ఆలయాలు నిర్మించానని మంత్రి అనడంతో అబద్ధాలు మాట్లాడొద్దంటూ నిరసనకు దిగారు. అంకుషాపూర్ గ్రామంలోని శివలాయాన్ని దేవాదాయ ధర్మాదాయ శాఖలో కలిపి ఎన్ని నిధులు కేటాయించారో తెలపాలని స్థానికులు పట్టుబట్టారు. నిధులు కేటాయించకుండా ఆలయాన్ని ఎండోమెంట్‌లో ఎందుకు విలీనం చేశారని ప్రశ్నించారు.

మేడ్చల్‌లో కాంగ్రెస్ జెండా ఎగరడం ఖాయం



మేడిపల్లి: మేడ్చల్ నియోజకవర్గ కాంగ్రెస్ అభ్యర్థి తోటకూర వజ్రేష్ యాదవ్ భారీ మెజార్టీతో గెలవడం ఖాయమని మేడిపల్లి కాంగ్రెస్ సీనియర్ నాయకులు అన్నారు. పీర్జాదిగూడ, మేడిపల్లి కాంగ్రెస్ నాయకులు శనివారం పలు డివిజన్లలో అభ్యర్థి తోటకూర వజ్రేష్ యాదవ్ విజయం కోసం గడప గడపకు ప్రచారం చేస్తూ కాంగ్రెస్ ఆరు గ్యారంటీలను ఓటర్లకు వివరిస్తూ చేతి గుర్తుకు ఓటు వేసి అధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

ఏహెచ్‌పీఎస్‌లో ఇంటర్ స్కూల్ కాంపిటేషన్స్



బోడుప్పల్: బోడుప్పల్ అకడమిక్ హైట్స్ పబ్లిక్ స్కూల్‌లో ప్రాథమిక స్థాయి విద్యార్థులకు 9వ ఇంటర్ స్కూల్ కాంపిటేషన్స్ పోటీలను ఘనంగా నిర్వహించారు. మొత్తం 8 బ్రాంచిల నుంచి 500 మంది విద్యార్థులు ఈ పోటీల్లో పాల్గొన్నారు. లిటరరీ, ఫైన్‌ఆర్ట్స్, స్పోర్ట్స్ విభాగాల్లో విద్యార్థులు ఎంతో ఉత్సాహంగా పాల్గొని బహుమతులు గెలుచుకున్నారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా స్కూల్ రీజనల్ డైరెక్టర్స్ రూపారెడ్డి, కౌషిక్‌రెడ్డి హాజరై కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బాల్యం నుంచి ఇలాంటి పోటీలు నిర్వహించడం వల్ల విద్యార్థుల్లో ప్రతిభ పెరుగుతుందన్నారు. ప్రిన్సిపాల్ నళిని జయ, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

బీజేపీ, బీఆర్‌ఎస్‌లను గద్దె దించాలి

బీసీ పొలిటికల్ ఫ్రంట్



మాట్లాడుతున్న బీసీ పొలిటికల్ ఫ్రంట్ రాష్ట్ర అధ్యక్షుడు ప్రొఫెసర్ మురళీ మనోహర్

జవహర్‌నగర్: బీసీ పొలిటికల్ ఫ్రంట్ తెలంగాణ రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో శనివారం జవహర్‌నగర్‌లో విలేకరుల సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఫ్రంట్ రాష్ట్ర అధ్యక్షుడు ప్రొఫెసర్ మురళీ మనోహర్ మాట్లాడుతూ.. రాష్ట్రం ఏర్పడిన తర్వాత బీఆర్‌ఎస్ ఎన్నికల్లో గెలిచి అధికారాన్ని చేపట్టి కుటుంబ పాలన రూపొందించుకుందన్నారు. సీఎం కేసీఆర్ తెలంగాణ సెంటిమెంట్‌ను తన స్వార్థ ప్రయోజనాలకే ఉపయోగించుకొని ప్రజాస్వామ్య వ్యవస్థలను భ్రష్టు పట్టించారన్నారు. ఎన్నో సంవత్సరాలుగా బీసీల సమస్యల పట్ల నిరంతరం పోరాటం చేస్తూ మరో వైపు అనేక ప్రజా సంఘాలతో కలిసి బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ సామాజిక వర్గాలతో అభివృద్ధి రాజ్యాధికారమే ధ్యేయంగా ఫ్రంట్ కృషి చేస్తుందన్నారు. పార్టీల మేనిఫెస్టోలను విశ్లేషించుకుని ఈ ఎన్నికల్లో బీఆర్‌ఎస్, బీజేపీలను ఓడించాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఫ్రంట్ ప్రధాన కార్యదర్శి సమ్మయ్య, వర్కింగ్ ప్రెసిడెంట్ కె.పద్మాచారి, శైలేష్, సందీప్ పాల్గొన్నారు.

ఆధునిక సాంకేతికతను అందిపుచ్చుకోవాలి


సంస్కృతి కళాశాల ఇంజనీరింగ్ సదస్సులో మాట్లాడుతున్న సురేశ్ పల్లె

ఘట్‌కేసర్: వేగంగా అభివృద్ధి చెందుతున్న ఆధునిక సాంకేతిక ప్రపంచంలో విద్యార్థులు ముందుండాలని హానీవెల్ డైరెక్టర్ సురేశ్ పల్లె అన్నారు. కొండాపూర్ సంస్కృతి ఇంజనీరింగ్ కళాశాలలో శనివారం నిర్వహించిన సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ ఫర్ యూత్ ఎంపవర్‌మెంట్ సదస్సుకు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అభివృద్ధి చెందిన ప్రాజెక్టులు, వ్యక్తుల విజయగాథలు ఔత్సాహిక ఇంజినీర్లకు స్ఫూర్తిదాయకం అవుతుందన్నారు. నూతన ఆవిష్కరణ కోసం ఇటువంటి సదస్సులు వారధిగా పని చేస్తాయన్నారు. కార్యక్రమంలో కళాశాల డైరెక్టర్ అమర్‌నాథ్, ప్రిన్సిపల్ ఉదయ్‌కిరణ్, కార్యదర్శి రాజేంద్రకృష్ణ, ప్లేస్‌మెంట్ ఆఫీసర్ నీలం సింగ్, విద్యార్థులు పాల్గొన్నారు.

ఆనంద తాండవమాడే..

మాదాపూర్: శిల్పారామంలో నిర్వహిస్తున్న సిద్దేంద్రయోగి ఆరాధనోత్సవాలు రెండవరోజు ఘనంగా నిర్వహించారు. శనివారం డాక్టర్ శ్రీనివాస్ వరప్రసాద్ శిష్యబృందం ప్రదర్శనలు సందర్శకులను అలరించాయి. శివ తాండవం, నాగస్తుతి, అన్నమాచార్య కీర్తన, గరుడగమన, కుండపై నృత్యం, మూషికవాహన, బ్రహ్మమొక్కటే తదితర అంశాలను ప్రదర్శించారు. కార్యక్రమంలో ప్రముఖ కూచిపూడి నాట్య గురువు డాక్టర్ విజయ్‌పాల్ పత్లోత్ కళాకారులకు ప్రశంసా పత్రాలను, జ్ఞాపికలను అందజేశారు.



బొమ్మరాశిపేట వైన్ షాపులో చోరీ



శామీర్‌పేట్: శామీర్‌పేట మండలం బొమ్మరాశిపేట వైన షాపులో చోరీ జరిగిన ఘటన శనివారం శామీర్‌పేట పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మండల పరిధిలోని బొమ్మరాశిపేట గ్రామంలోని శ్రీరేణుకా ఎల్లమ్మ వైన్‌షాపును నవీన్‌గౌడ్ శుక్రవారం 10 గంటల సమయంలో వైన్‌షాపునకు తాళం వేసి వెళ్లిపోయాడు. శనివారం ఉదయం వైన్‌షాపు షెటర్ తెరిచి ఉందన్న సమాచారంతో అక్కడికి చేరుకొని చూడగా చోరీ జరిగినట్లు గమనించాడు. వెంటనే పోలీసులకు సమాచారం అందించగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

మేడ్చల్‌లో బీజేపీ ప్రచారం



మేడ్చల్: మేడ్చల్ పట్టణం, మండలంలోని డబీల్‌పూర్, నూతన్‌కల్, శ్రీరంగవరం, బండమాదారం, గిర్మాపూర్, గౌడవెల్లి తదితర గ్రామాల్లో బీజేపీకి ఓటు వేయాలని కోరుతూ ప్రచారం నిర్వహించారు. గ్రామాల్లో అభ్యర్థి సుదర్శన్‌రెడ్డి, మండల, మున్సిపాలిటీల నాయకులు రోడ్ షో నిర్వహించి ప్రచారం చేశారు.

ధన బలంతో వస్తున్న మల్లారెడ్డిని ఓడించాలి

- సీపీఐ రాష్ట్ర కార్యవర్గసభ్యుడు బాలమల్లేష్
- కాంగ్రెస్ గెలుపు కోసం విస్తృతంగా ప్రచారం


మాజీ ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి సమక్షంలో కాంగ్రెస్‌లో చేరుతున్న బీఆర్‌ఎస్ నాయకులు


బోడుప్పల్‌లో..


హాజరైన ప్రజలు

శామీర్‌పేట్: ధన బలంతో వస్తున్న మంత్రి మల్లారెడ్డిని అసెంబ్లీ ఎన్నికల్లో ఓడించాలని సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు బాలమల్లేష్ అన్నారు. శనివారం జవహర్‌నగర్ మున్సిపాలిటీ పరిధిలో ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. పదేళ్ల బీఆర్‌ఎస్ పాలనలో ప్రజల సంక్షేమాన్ని వదిలి కార్పొరేట్ శక్తులకే సీఎం కేసీఆర్ కొమ్ముకాశారని విమర్శించారు. మల్లారెడ్డి ప్రభుత్వ భూములు, శిఖం భూములను కబ్జా చేశారని, వాటిని కాపాడుకునేందుకే ధన బలంతో ఓట్లు కొనుగోలు చేసి గెలిచే ప్రయత్నం చేస్తున్నాడన్నారు. పేదలకు కాకుండా తన అనుచరులకే సంక్షేమ పథకాలు అందిస్తున్నాడని, ఎన్నికల్లో మల్లారెడ్డికి గుణపాఠం చెప్పాలన్నారు.

కీసరలో..

కాంగ్రెస్ గెలుపు ఖాయమని నాగారం పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు ముప్ప శ్రీనివాస్‌రెడ్డి, వర్కింగ్ ప్రెసిడెంట్ నల్లోల కుమార్ అన్నారు. మున్సిపాలిటీ పరిధిలోఎన్నికల ప్రచారంలో వారు పాల్గొన్నారు. మేడ్చల్ కాంగ్రెస్ అభ్యర్థి తోటకూర వజ్రేష్‌యాదవ్ గెలుపు ఖాయమైందని, మల్లారెడ్డిని బోయిన్‌పల్లికి పరిమితం చేసేందుకు ఓటర్లంతా సిద్ధంగా ఉన్నారన్నారు.

శామీర్‌పేటలో చేరికలు..

కాంగ్రెస్ ఆరు గ్యారంటీలను ప్రజల్లోకి తీసుకెళ్లి, అభ్యర్థి వజ్రేష్ యాదవ్ గెలుపునకు కృషి చేయాలని సీనియర్ నాయకుడు కంటం కృష్ణారెడ్డి అన్నారు. అలియాబాద్ గ్రామ అధ్యక్షుడు యాదగిరి, నాయకుడు కంటం కృష్ణారెడ్డి ఆధ్వర్యంలో బీజేపీ యువకులు కాంగ్రెస్‌లో చేశారు.

కాంగ్రెస్ ఆరు పథకాలతో సేవలందిస్తాం

జవహర్‌నగర్: కాంగ్రెస్ పార్టీ ఆరు గ్యారంటీ పథకాలతో ప్రజలకు సేవలు అందిస్తామని మాజీ ఎమ్మెల్యే మలిపెద్ది సుధీర్‌రెడ్డి అన్నారు. జవహర్‌నగర్ కార్పొరేషన్ 6వ డివిజన్ బీఆర్‌ఎస్ అధ్యక్షుడు జంగిటి రమేష్ పార్టీకి రాజీనామా చేసి కాంగ్రెస్‌లో చేరారు. కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు మల్లెపూల శ్రీకాంత్‌యాదవ్ ఆధ్వర్యంలో మాజీ ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి, మాజీ సర్పంచ్ కారింగుల శంకర్‌గౌడ్ సమక్షంలో జంగిటి రమేష్, పలువురు బీఆర్‌ఎస్ నాయకులు కాంగ్రెస్‌లో చేరారు. రవి, లక్ష్మణ్, చంద్రమౌళి తదితరులు పాల్గొన్నారు.

ఘట్‌కేసర్‌లో..

రోజు రోజుకూ కాంగ్రెస్ పార్టీకి ఆదరణ పెరుగుతోందని, కాంగ్రెస్ మేడ్చల్ ఎమ్మెల్యే అభ్యర్థి తోటకూర వజ్రేష్‌యాదవ్ గెలిచేది ఖాయమని కాంగ్రెస్ మున్సిపల్ అధ్యక్షుడు ముత్యాలుయాదవ్ అన్నారు. మున్సిపాలిటీలోని 6వ వార్డులో కాంగ్రెస్ పార్టీ ఆరు హామీలను ఇంటింటికీ ప్రచారం చేసి చేయి గుర్తుకు ఓటు వేయాలని కోరారు.